క్లుప్తంగా

పుట్టినరోజు హరితహారం



జనగామ: పట్టణంలోని 12వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు గుర్రం నాగరాజు పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని బర్త్ డే ట్రీ, అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బర్త్‌డే ట్రీ అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజ్, అమ్మ ఫౌండేషన్ టీం కామని వేణు, కామని మహేందర్, గుర్రం ఉపేందర్, బిట్ల శంకర్, గుర్రం వేణు, నల్ల వంశీ, బింగి నరసింహులు, కందగట్ల సోమయ్య, బిట్ల శంకర్, సత్యనారాయణ, అశోక్, భిక్షపతి పాల్గొన్నారు.

రఘునాథపల్లి సర్పంచ్‌గా రాములు



రఘునాథపల్లి: రఘునాథపల్లి సర్పంచ్‌గా యాద రాములుకు సోమవారం పంచాయతీ కార్యదర్శి కవిత బాధ్యతలు అప్పగించారు. సర్పంచ్‌గా పనిచేసిన పోకల శివకుమార్‌ను ఇటీవల అధికారులు సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న రాములు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్యప్రకాశ్



కొడకండ్ల: తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా అన్నా వజ్జుల సూర్యప్రకాశ్ నియామకమైనాడు. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన ఆయన అనేక సంవత్సరాలుగా బీజేపీలో పనిచేస్తూ సామాజిక కార్యక్రమాలు, దేవాలయాలు, వృద్ధాశ్రమాలు నిర్మించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా నియమించింది. తన నియామకం కోసం సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, బండి సంజయ్, రాంచందర్‌రావు, ప్రభాకర్, గీతామూర్తి, సుభాష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతర చైర్మన్‌గా హుస్సేన్‌నాయక్



చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్-గార్లగడ్డ తండా పంచాయతీల పరిధిలోని మల్లన్నగండి సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా ఫత్తేపూర్‌కు చెందిన బానోత్ హుస్సేన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సర్పంచ్ రూప్లానాయక్, వివిధ పార్టీల నాయకుల సమక్షంలో కమిటీని ప్రకటించారు. వైస్ చైర్మన్లుగా భూక్య మోహన్, భీమగోని రాజు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



బచ్చన్నపేట : ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఆ శాఖ మండల అధ్యక్షుడు సంతోష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని, ప్రతి విద్యార్థిని ఉత్తముడిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుడిపై ఉంటుందన్నారు. అనంతరం టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

స్టేషన్‌ఘన్‌పూర్: పీఆర్‌టీయూ ఆవిర్భావం నుంచి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. పీఆర్‌టీయూ ఘన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడారు. మండల నోడల్ అధికారి జి.కొమురయ్య, ఘన్‌పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శారోని, శివునిపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనుగాల ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు లక్ష్మీప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, రవికుమార్, శ్రీధర్, తిరుపతిరెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గేనా..?

- రేపే అవిశ్వాస సమావేశం
- ఎంపీపీ ఆధ్వర్యంలో గోవాకు వెళ్లిన 8 మంది ఎంపీటీసీలు
- హాట్ టాపిక్‌గా మారిన వైనం



గోవా క్యాంపులో ఉన్న ఎంపీటీసీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కందుల రేఖగట్టయ్యపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యుల సంతకాలతో కూడిన దరఖాస్తును డిసెంబర్ 16న ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తికి అందించిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ కందుల రేఖపై అదేపార్టీకి చెందిన వారు అసమ్మతితో అవిశ్వాసం కోరడం చర్చనీయాంశంగా మారింది. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 2019 జూలైలో జరిగిన ఎన్నికల్లో ఘన్‌పూర్ ఎంపీపీ ఎస్సీకి రిజర్వ్ కాగా మీదికొండ, రాఘవాపూర్ గ్రామాల ఎంపీటీసీగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన కందుల రేఖ(ఎస్సీ మాల) ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఎంపీటీసీల పదవీ కాలం ఈ ఏడాది జూలైలో ముగియనుంది. అయితే ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు కొద్దిరోజులుగా ఎంపీటీసీలు రహస్య సమావేశాలు నిర్వహించి ఎట్టకేలకు గత నెల 16న తొమ్మిది మంది ఎంపీటీసీల సంతకాలతో కూడిన దరఖాస్తును ఆర్డీఓకు అందించారు. సంతకాలు చేసిన వారిలో ఆరుగురు బీఆర్‌ఎస్, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ వారున్నారు. మొత్తంగా 15 మంది ఎంపీటీసీ స్థానాలకు గాను ప్రస్తుతం ముగ్గురు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో, ఒక్కరు సీపీఎంలో, 11 మంది బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నారు. కాగా అవిశ్వాసం ఓకే అయితే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఛాగల్లు ఎంపీటీసీ కనకం స్వరూపగణేష్ ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

10న అవిశ్వాసంపై సమావేశం

ఎంపీపీపై అవిశ్వాసాన్ని కోరుతూ ఎంపీటీసీలు అందించిన దరఖాస్తు ఆధారంగా నిబంధనల మేరకు ఆర్డీఓ మండలంలోని ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 10న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఉంటుందని, హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

గోవాకు వెళ్లిన 8 మంది ఎంపీటీసీలు

ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గాలంటే నిబంధనల మేరకు 2/3 ఎంపీటీసీలు(10మంది) ఉండాలి. ప్రస్తుత ఎంపీపీ కందుల రేఖగట్టయ్య ముందస్తుగా అప్రమత్తమయ్యారు. అవిశ్వాస సమావేశానికి వెళ్లొద్దని కోరుతూ 8 మంది ఎంపీటీసీలను గోవా టూర్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. అవిశ్వాసానికి సంబంధించిన సమాచారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి ఇప్పటికే వెళ్లగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలతో మాట్లాడి నచ్చజెప్పినట్లు తెలుస్తున్నది.

ఆత్మస్థైర్యానికి కరాటే దోహదం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులతో టీచర్లు

జఫర్‌గఢ్: బాలికల ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో దోహదం చేస్తుందని కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయలో కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు కరాటే, క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ కోసం తప్పని సరిగా కరాటే శిక్షణ పొందాలన్నారు. ఈ శిక్షణలో ప్రతిభను కనబర్చిన బాలికలకు అకాడమీ వారు సర్టిఫికెట్లు అందజేయడం అభినందనీయమన్నారు. కరాటే మాస్టర్ రాజేంద్రం. ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘విశ్వకర్మ యోజన’ను వినియోగించుకోవాలి



వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారంలో విశ్వకర్మ యోజన బంధు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పథకానికి 18 కులాల ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చునని, వారి జీవనోపాధి కోసం రూ. 3లక్షల రుణాన్ని అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, నాయకులు ఇజ్జగిరి నారాయణ, గొరారం శ్రీనివాస్, రాపెల్లి చెక్రపాణి, కొల్ల వెంకట్‌రెడ్డి, చల్ల కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి



శిక్షణలో పాల్గొన్న మహిళలు

జనగామ: పట్టణంలోని వీవర్స్‌కాలనీ 12వ వార్డులో సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన కోసం టైలరింగ్, బ్యూటీషన్, మగ్గం వర్క్, హోంనీడ్ ప్రొడక్ట్స్ తదితర వాటిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మీనాగరాజు, సుందరయ్య, టీవీకే రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



కొడకండ్ల: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సోమవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంసాగర్ నీటి విడుదల కోసం కొడకండ్లకు వచ్చిన ఎమ్మెల్యేను పాలకుర్తి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దేశగాని హరగోపాల్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు అందె హరీష్, ముక్కెర రోహిత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు..



పాలకుర్తి: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు హేమలత ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. నాయకులు వీరమల్ల బాబయ్య, చిక్కుడు శ్రీనివాస్, చిదురాల రమేష్, తోట వెంకట్, విజయరాణి, సునీత, మధు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఆల్ఇన్‌వన్ పుస్తకాలతో విద్యార్థులు

జఫర్‌గఢ్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ తాటికాయల అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి కోరారు. రోటరీ క్లబ్ అఫ్ వరంగల్ ఆధ్వర్యంలో హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేష్‌బాబు, సెక్రటరీ మన్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నష్కల్‌కు బస్సు సర్వీసు కల్పించాలి



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న సురేష్

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామానికి అధికారులు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాశం సురేష్ కోరారు. ఈ మేరకు హనుమకొండ ఆర్టీసీ డీఎంకు సోమవారం వినతి పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జనగామ బస్సు నష్కల్ మీదుగా వెళ్లేది, రైల్వే గేట్‌కు బదులు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో బస్సు సర్వీసు నిలిపి వేశారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా తిరిగి బస్సు సర్వీసును పునరుద్ధరించలేదన్నారు. గ్రామంలోకి బస్సు సౌకర్యం లేక జాతీయ రహదారిలోని బస్‌స్టాప్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు, విద్యార్థులు రెండు కిలోమీటర్ల నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరకు విన్నవించిన నాయకులు

గ్రామంలోకి ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరను నాయకులు కోరారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా వారు త్వరలో సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పాలకుర్తి: సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేసినట్లు సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాంబాబు నాయక్ తెలిపారు. సోమవారం నారబోయిన గూడెంలో దాతల ఆధ్వర్యాన క్రీడా పోటీలు నిర్వహించారు. గూగుల్ యాకన్న, పాడిశెట్టి వెంకన్న సహకారంతో ఈ పోటీలు జరిగాయి. కబడ్డీలో ప్రథమ స్థానం వావిలాల జట్టు, ద్వితీయ పాలకుర్తి జట్టు, తృతీయ కొడకండ్ల, నాల్గవ స్థానంలో హరిపిరాల జట్టు నిలువగా బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ రాసమల్ల యాకస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మండల ఫొటో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొన్నె సతీష్, మండల అధ్యక్షుడు ముప్పిడి సాయి, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ కొయ్యడ రాజు, మణిరాజ్, సోమరాజ్, సతీష్, చొప్పరి రాజు, మహేష్, ఉపేందర్, మంజు, మణికంఠ, రమేష్ తదితరులు ఉన్నారు.

కొండాపూర్‌లో..

చిల్పూరు: ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన మండలంలోని కొండాపూర్ కార్యదర్శి కొల్లూరి రాజు కుటుంబానికి చిల్పూరు ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మండల పంచాయతీ కార్యదర్శులు రంగారెడ్డి, మధుసూదన్, శశికుమార్, తండ రాంబాబు, అజీజ్‌పాషా, విమల, రాజు, స్నేహ, బాపునాయక్ తదితరులు ఆర్థికసాయం చేశారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన



జఫర్‌గఢ్: అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జఫర్‌గఢ్: ప్రజాపాలనలో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తి సోమవారం పరిశీలించారు. ఈ నెల 5 నుంచి స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన నమోదు ప్రక్రియను చేపట్టారు. కాగా, అదనపు కలెక్టర్, ఆర్డీఓ వేర్వేరుగా వచ్చి ఆన్‌లైన్ నమోదును పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. గడువులోగా ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, మండల ప్రత్యేక అధికారులు లక్ష్మీమనోహర్, శ్రీనివాసులు, డీటీ హరిప్రసాద్, ఆర్ఐ అనిల్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐదు గ్యారంటీల పథకాలను అమలు చేసే దిశలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు తలపెట్టిన డాటా ఎంట్రీ ఊపందుకుంది. తెలంగాణ ప్రభుత్వం నిర్దేశిత కాలంలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తిచేయాలనే ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులు, మండల అధికార యంత్రాంగం రాత్రనక, పగలనక అనుబంధ శాఖల సిబ్బంది, మీసేవ తదితర ఆపరేటర్లతో డాటా ఎంట్రీని చేపడుతున్నారు. దేవరుప్పుల మండలంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి 13,010 దరఖాస్తులు స్వీకరించగా సోమవారం నాటికి 8,567 దరఖాస్తులను ఎంట్రీ చేశారు. ఈసేవ జిల్లా మేనేజర్ దుర్గారావు, ప్రత్యేక అధికారులు హుస్సేన్, రాముల, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, ఎంపీఓ సురేష్‌కుమార్, సిబ్బంది కృపాకర్‌రెడ్డి, మల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ జెడ్పీఎస్ఎస్‌లో నూతనంగా చేపట్టనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి రూ.13లక్షల నిధులు మంజూరు అయ్యాయన్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టి విద్యార్థులకు సైన్స్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈ నర్సింగం, హెచ్‌ఎం కొడ రాజేందర్, ఉప సర్పంచ్ మారపాక రాములు, ఎస్ఎంసీ చైర్మన్ మారపాక యుగేందర్, వార్డు సభ్యులు బర్మ రాజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



జనగామ: అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

జనగామ/చిల్పూరు/జఫర్‌గఢ్/బచ్చన్నపేట: జనగామ పట్టణంతోపాటు జిల్లాలోని పలు గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతలతో సోమవారం భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నగర సంయోగ గుణికంటి రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, ఏరియా సంయోగ తడకమల్ల నరసింహారావు ప్రతినిధులు ఐత శ్రీనివాస్ రామిని రాజేశ్వర్, ఎర్రం హనుమంతరావు, నాళ్ల మధు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భిక్షపతి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి రజిత యాకయ్య, నిరంజనాచారి, వెంకటస్వామి, గోపాల్, వేణు, రాజేష్, సర్పంచ్ స్వామి, మండల సంయోజక్ రాజయ్య, రాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంగళ్‌రావు మృతి తీరని లోటు



పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ చెన్నూరు గ్రామ అధ్యక్షుడు పుస్కూరి వెంగళ్‌రావు (50) ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. సోమవారం వారు వెంగళరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలగం కుమార్, మండల ప్రధాన కార్యదర్శి బైరి భార్గవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాదాసు హరీశ్ గౌడ్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు గడ్డం యాకసోమయ్య, కారుపోతుల శ్రీనివాస్, మండల నాయకులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు

జనగామ: లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రితో ఫార్మా కంపెనీ సౌజన్యంతో సోమవారం సుమారు 150 మందికి ఉచిత బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించారు. శరీరంలోని ఎముకల సామర్థ్యం ఏ మేరకు ఉందో తెలుసుకునే, అవసరమైతే చికిత్సలు చేసుకునే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి, జోన్ చైర్మన్ జైన రమేశ్, క్లబ్ సభ్యులు జైన సంధ్యారాణి, దోర్నాల రమేష్ ఉన్నారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండకు చెందిన కడియం యువసేన సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మేకల శ్రీకాంత్ తండ్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామానికి చెందిన గుర్రపు రాజమ్మ ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నివాళి

దేవరుప్పుల: కడవెండికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు దుబ్బాక రత్నాకర్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. కాగా బీఆర్‌ఎస్ మండల సమన్వయ కమిటీ ప్రతినిధులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేష్, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య తదితరులు వెంకట్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వినియోగంలోకి గురుకుల ఆవరణ



దేవరుప్పుల: బాలికల విద్యావికాసం కోసం వెల్లువిరిసిన గురుకులాల్లో కనీస నిర్వహణకు నిధులు లేని తరుణంలో పిచ్చిచెట్లు పెరిగి అసౌకర్యంగా మారిన తరుణంలో దాతల సహకారంతో పరిశుభ్రమై వినియోగంలోకి వచ్చింది. మండల కేంద్రంలోని కొత్తకాలనీలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఆవరణ(గ్రౌండ్) ఉంది. ఈ ఆవరణలో అనవసరమైన చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారాయి. పాలకుర్తి వాస్తవ్యులు ఆర్‌టీఏ ఘంటా రవీందర్ ఆర్థిక సహకారంతో ఆవరణ చదును చేయడమేగాక కొంత భాగం నిత్యం ఆహారంలో వినియోగించే ఆకు కూరల సాగుకు శ్రీకారం చుట్టారు. రవీందర్ సహకారం పట్ల ప్రత్యేక అధికారిణి సుకన్య, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



కొడకండ్ల: మండలంలోని నీలిబండతండాలో యువనేస్తం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ సహకారంతో ఈసీజీ, బీపీ, షుగర్, కంటి తదితర పరీక్షలను సంబంధిత విభాగాల వైద్యులచే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విమల, యూత్ అధ్యక్షుడు వాంకుడోత్ ప్రేమ్‌రాజ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, సుమన్, నందకిషోర్, సందీప్ పాల్గొన్నారు.

ఉప్పలయ్యను ఆదుకుంటాం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత కోసం తపనపడే సీనియర్ నాయకుడు ఉప్పలయ్యను పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని కోలుకొండలో అనారోగ్యానికి గురైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోతి ఉప్పలయ్యను ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దులు, సీనియర్ నాయకులు ఉన్నారు.

కాపర్ వైరు చోరీ

తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారంలో వ్యవసాయ బావి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరును గుర్తుతెలియని దుండగులు సోమవారం అపహరించారు. అబ్దుల్‌నాగారం శివారు కావటి పోషయ్య బావి వద్ద 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులోని కాపర్‌వైరును ఎత్తుకెళ్లారు. వైరు విలువ రూ.50 వేలు ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అధికారులు తెలిపారు.